క్లుప్తంగా

మహిళాభివృద్ధికి తోడ్పాటు



ఆహా క్యాంటీన్ ప్రారంభించి, భోజన ప్యాకెట్ కొనుగోలు చేస్తున్న చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: మహిళాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలోని గాంధీపార్కు వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను గురువారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. అమె మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వివిధ రకాల పనులు నిమిత్తం పలువురు పట్టణానికి వస్తుంటారని, వారికి తక్కువ ధరకే ఆహారం అందించాలన్న లక్ష్యంతో మెప్మా సౌజన్యంతో పొదుపు మహిళలు క్యాంటీన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. రోజూ మధ్యాహ్నం సమయంలో వెజిటబుల్ రైస్, పెరుగు అన్నం, టమాట రైస్, పులిహోర తదితర ఆహార పదార్థాలు తక్కువ ధరకే విక్రయిస్తామని పొదుపు గ్రూపు సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సోమకుమార్, డీఎంసీ జయరామ్, సీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఆక్వా ఫీడ్ అమ్మకాల నిషేధం



సీజ్ చేసిన ఆక్వా కెమికల్స్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

వాకాడు: కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ అనుమతులు లేని ఆక్వా ఫీడ్‌ను ఎక్కడైనా రైతులకు విక్రయిస్తే ఆ షాపులను సీజ్ చేయడమే కాకుండా ఆయా యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ హెచ్చరించారు. మండలంలోని పలు ఆక్వాఫీడ్ షాపులపై గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలసి ఆయన దాడులు చేశారు. ఈ దాడుల్లో వాకాడు అశోక్ స్తంభం కూడలిలోని బాలాజీ ఆక్వా కెమికల్స్ షాపులో తనిఖీలు నిర్వహించగా అందులో కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు లేని పలు రకాల ఆక్వా కెమికల్స్‌ను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వాకాడులోని బాలాజీ ఆక్వా కెమికల్స్ షాపులో నిర్ధేశించిన సీఏఏ అనుమతులు లేని 7 రకాల ఆక్వా కెమికల్స్‌ను రైతులకు విక్రయిస్తుండడంతో వాటిని సీజ్ చేసి, రూ. 25 వేలు అపరాధం విధించామన్నారు. సీఏఏ ఇన్‌స్పెక్టర్ దివాకర్, ఎఫ్‌డీఓ రెడ్డి నాయక్, వీఆర్వో కాటమ్మ పాల్గొన్నారు.

మేళాను సద్వినియోగం చేసుకోండి

డక్కిలి: వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జేసీఎస్ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన డక్కిలిలో మాట్లాడుతూ నేదురుమల్లి ఫౌండేషన్ అధ్వర్యంలో, టీమ్ లీసే సహకారంతో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు.

లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

చిల్లకూరు: గూడూరు ఏఎంసీ అధ్వర్యంలో పొలాల్లోకి లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ తెలిపారు. ముత్యాలపాడు సమీపంలో ఉన్న ఏఎంసీ కార్యాలయంలో గురువారం కమిటీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల సౌలభ్యం కోసం లింక్ రోడ్ల అవసరాన్ని గుర్తించామన్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు కోరిన ప్రాంతాల్లో లింక్ రోడ్లు త్వరలో నిర్మించేలా నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

కోట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ తెలిపారు. గురువారం కోటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీ చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాకాడు మండలంలో దుగ్గరాజపట్నం పోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిల్లకూరు: మండలంలోని కడవేడు దళితవాడలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండలం బాలిరెడ్డిపాళేనికి చెందిన రమణయ్య(38)కు పదేళ్ల కిందట కడివేడులోని శ్యామలతో వివాహం జరిగింది. తరువాత కొంత కాలంగా ఆమె తన పుట్టింట్లోనే ఉంటుండగా రమణయ్య అప్పడప్పుడు వచ్చి వెళుతుండే వాడు. ఈ క్రమంలో అతడు అత్తగారింటికి వచ్చి పిల్లలను తనతో తీసుకెళతామని భార్యకు చెప్పగా ఆమె నిరాకరించింది. మనస్తాపం చెందిన అతడు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి గూడూరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నాయుడుపేటటౌన్: సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గూడూరురూరల్: ఆకట్టుకుంటున్న శ్రీకృష్ణుడి బొమ్మల కొలువు

భూలోకం.. బృందావనం

మురిపాల మోహనుడు.. మువ్వగోపాలుడు నల్లని రంగున్నా.. తెల్లని మనస్సు ఉండాలని చాటి చెప్పాడు వేణుగోపాలుడు. వెన్నదొంగగా విలువైన సందేశాలిచ్చాడు. రథసారథిగా గీతోపదేశం చేశాడు. మంచికే మద్దతు పలకాలని నిరూపించాడు. ఇన్ని లీలలు చేసిన నల్లనయ్యకు భక్తులు వెన్నెల హారతులిచ్చారు. కృష్ణాష్టమి సందర్భంగా పల్లెలు, పట్టణాలు రేపల్లెలుగా మారాయి. భూలోకం బృందావనం అయ్యింది. గురువారం ఊరూవాడా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకగా జరుపుకున్నారు.

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రాజగోపాలపురం వీధిలో ఉన్న సీతారామాంజనేయ స్వామి అలయంలో యాదవ సంక్షేమ సంఘం అధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. తొలుత గణపతి హోమం చేశారు. అనంతరం వందలాది మహిళలతో సామూహిక కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి కృష్ణభగవానుడి నగరోత్సవం వేడుకగా సాగింది. శ్రీకృష్ణమందిరంలో శ్రీకష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం జరిపారు.

మాంబట్టులో..

తడ: మాంబట్టులోని అన్నపూర్ణ అన్నదాన సత్రం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత గోపూజ, అన్నపూర్ణాదేవికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం టీటీడీ అన్నమాచార్య భక్త బృందం వారిచే హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.



నాయుడుపేటటౌన్: శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

గీత మందిరంలో..

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెంలోని గీత మందిరంలో గురువారం కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యక పూజలు చేశారు. శ్రీకృష్ణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సూళ్లూరుపేట పట్టణానికి చెందిన భజన బృందం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గూడూరులో..

గూడూరురూరల్: పట్టణంలోని రాజావీధిలో ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి బొమ్మల కొలువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడి గ్రామోత్సవం వైభవంగా సాగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పట్టణంలోని సాయిబాబా మందిరంలో శ్రీకృష్ణుడికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, గోపూజ నిర్వహించారు. త్యాగరాజావీధిలో ఉన్న శ్రీకృష్ణగీతా మందిరంలో స్వామివారికి ఊంజల్ సేవ చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని రాపూరు క్రాస్ రోడ్డులోని శ్రీరాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. పుర వీధుల్లో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులకు రాధాకృష్ణుల వేషధారణలో నిర్వహించిన నృత్యాలు, ఆటల పోటీలు పలువురిని అలరించాయి. పట్టణంలోని బంగారుపేట వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలో పలు ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట యాదవసంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో షార్ బస్టాండ్ సెంటర్లో ప్రత్యేకంగా సెట్ వేసి కృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. కోటపోలూరుకు చెందిన యాదవ సంఘం మహిళా ప్రతినిధులు సుమారు 500 మందికి అన్నదానం చేశారు. పీర్లచావిడి సెంటర్, కేఆర్‌పీ కాలనీ సమీపంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం, శ్రీ మద్వేంకట రామమూర్తుల స్వామి ఆలయం, షార్ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గాండ్లవీధిలోని శ్రీ పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



వెంకటగిరిరూరల్: రాధాకృష్ణుల గ్రామోత్సవం



సూళ్లూరుపేట: మహాయజ్ఞం చేస్తున్న అర్చకులు

ఇంటింటికీ సంక్షేమం.. అన్ని వర్గాల్లో సంతోషం



లబ్ధిదారులకు బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధిని చేకూరుస్తున్నారని, దీంతో అన్నీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి మున్సిపాలిటీలోని 23వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై ఆరా తీశారు. అనంతరం లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, కౌన్సిలర్ ఏ శ్రీనివాసులు, ఏ శంకరయ్య, వహిద, సుబ్బారావు పాల్గొన్నారు.

నవరత్న పథకాలు దేశానికే ఆదర్శనీయం.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాలాయపల్లి మండలంలోని చిలమనూరు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సీ భాస్కర్ రావు, సర్పంచ్ ఏ సురేష్, ఎంపీటీసీ సభ్యుడు వీ సురేంద్ర, నాయకులు వెంకటసుబ్బయ్య, దేవిక చౌదరి, సురేంద్రరెడ్డి, గోపికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిలమనూరులో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న నేదురుమల్లి

పోషకాహారంతో తల్లీబిడ్డ క్షేమం



మాట్లాడుతున్న సీడీపీఓ మెహబూబీ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజన

గూడూరురూరల్: పోషకాహారంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మెహబూబీ అన్నారు. మండలంలో జరుగుతున్న పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా విందూరు గ్రామంలో పోహకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార బ్యాగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి కిరణ్మయి, సూపర్‌వైజర్ హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, సుజాత, లక్ష్మి, మీరమ్మ, కోటేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఓజిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన అన్నారు. మండలంలోని రాచపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్నం మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

గూడూరురూరల్: పార్లమెంట్, రాజ్యసభ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావును కలిసి వినతపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు సిసింద్రీ మాదిగ, గోవిందు వాసు మాదిగ, పీ మస్తానయ్య మాదిగ, విజయలక్ష్మి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల ఫీల్డ్ విజిట్



తాళ్వాయిపాడులోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శుల బృందం

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడులో ఉన్న శ్రీరామచంద్ర ఎన్‌క్లేవ్‌ను గురువారం పలువురు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ విజిట్ చేశారు. రీఫ్రెషర్ ట్రైనింగ్ ఆఫ్ పంచాయతీ సెక్రటరీస్‌లో భాగంగా పరిసర ప్రాంతాల్లో పూర్తి నిబంధనలతో ఏర్పాటు చేసి ఉన్న శ్రీరామచంద్ర లేఅవుట్‌ను విజిట్ చేసి, అక్కడి వసతులను పరిశీలించారు. వెంచర్ ఏర్పాటులో గ్రామానికి కేటాయించాల్సిన పదిశాతం స్థలం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, విశాలమైన సిమెంట్‌రోడ్లు, వీధులకు ఇరువైపుల మొక్కలు పెంపకం, మురుగుకాలువలు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జగనన్న భూహక్కు-భూరక్షపై గ్రామంలో పరిశీలన చేపట్టారు. భూసర్వే చేసిన గ్రామకంఠం భూమిని పరిశీలించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం గ్రామంలో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు.

మూడు రకాల మందుల సీజ్

చిల్లకూరు: స్థానిక మత్స్యశాఖాధికారి రఘుబాబు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలు ఆక్వాఫీడ్ దుకాణాల్లో తనిఖీలు చేసి, మూడు రకాల మందులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మండలకేంద్రంలోని సాయిరాం ఆక్వా ఫీడ్ దుకాణంలో తనిఖీలు చేశారు. దుకాణంలో మూడు రకాల మందులు అనుమతులు లేనివి గుర్తించి, సీజ్ చేశారు. అనుమతులు లేని మందులు విక్రయించినందుకు రూ.75 వేల జరిమానా విధించినట్లు మత్స్యశాఖాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖాధికారులు వరప్రసాద్, పుష్పరాజ్, తేజస్విని, వెంకటరమణ, విజయ, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు పంపిణీ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేట దళితవాడకు చెందిన చెన్నూరు శ్రీనివాసులు (45) కుటుంబ సభ్యులకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు గురువారం వైఎస్సార్ బీమా నగదు పంపిణీ చేశారు. శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బాబు, వార్డు కౌన్సిలర్లు సుబ్బారావు, బూత్ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, నాయకులు ఎస్ నాగరాజు అతడి ఇంటికి వెళ్లి శ్రీనివాసులు తల్లి పెంచలమ్మకు అందజేశారు.



బీమా నగదు అంజేస్తున్న కౌన్సిలర్ తదితరులు

మెరుగైన వైద్యానికి ఆస్పత్రుల అభివృద్ధి



ప్రభుత్వాస్పత్రిలో నూతన భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి తమ ప్రభుత్వం సర్కారు ఆస్పత్రులను అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని సీహెచ్‌సీలో నిర్మిస్తున్న భవనాలను ఆకస్మికంగా పరిశీలించారు. భవన నిర్మాణ వివరాలను కాంట్రాక్టర్, డాక్టర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ (ప్రభుత్వాస్పత్రి)లో నాబార్డు నిధులు రూ.5.5 కోట్లతో నిర్మించిన అదనపు గదులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడుదల రజనీ చేతులు మీదుగా ప్రారంభించబోతున్నామన్నారు. నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల రానుండడంతో ప్రభుత్వాస్పత్రులకు అదనంగా నాబార్డు నుంచి నిధులు తీసుకొచ్చి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి, కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వాస్పత్రులోనే అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో ప్రభుత్వాస్పత్రులంటే దయనీయంగా ఉండేవని, నేడు అవి కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఉన్నాయన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు జే వేణుయాదవ్, ఎం రామకృష్ణారెడ్డి, ఏ శ్రీధర్, ఏ సురేష్, వీ బాబురెడ్డి, కే శ్రీరామ్మూర్తి, కే మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పట్టు వస్త్రాల సమర్పణ

నాయుడుపేటటౌన్: రాజగోపాలపురంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం శ్రీకృష్ణభగవానుడికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సంజీవయ్యతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాధకిషోర్ తదితర నాయకులకు స్థానిక యాదవ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవయ్య స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు వీ కిషోర్‌యాదవ్, కే జయరామయ్య, బీ మల్లికార్జున రెడ్డి, పీ హరినాథ్‌రెడ్డి, పీ నాగార్జున, సీహెచ్ చెంగయ్య, పీ రాజేష్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజాజీవనం మెరుగు

గూడూరురూరల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాల అమలు చేయడంతో ప్రజల జీవనం మెరుగుపడిందని నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. గూడూరు మండలంలోని మిట్టాత్మకూరులో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావుతో కలిసి ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గూడూరు మండలానికి జెడ్పీ కోటాలో 15వ ఆర్థిక సంఘం నిధులు 4 పనులకు రూ.16 లక్షలు, జెడ్పీ సాధారణ నిధుల నుంచి 11 పనులకు రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ ఊటుకూరు యామిని మాట్లాడుతూ గూడూరు మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు యామిని, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ మమతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీహరి, నాయకులు సుబ్బానాయుడు, ఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవన ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

మైనారిటీల సంక్షేమానికి కృషి

కోట: ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జి హంజా హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం వాకాడు మండలంలోని పలు గ్రామాల్లో మసీదులను గూడూరు నియోజకవర్గం ముతవల్లీల కమిటీ అధ్యక్షుడు మొబీన్‌బాషాతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, మసీదుల అభివృద్ధికి కేటాయించిన నిధులపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హంజాహుస్సేన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ముస్లిం మైనారిటీలకు ఎంతో ప్రయోజనం చేకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిలానీబాషా, అమీర్, నజీర్, సందానీ, రెహమాన్ పాల్గొన్నారు.



కరపత్రాలను చూపుతున్న మైనారిటీ నాయకులు

పోషకాహారంతో రక్తవృద్ధి

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తం బాగా వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక తెలిపారు. చిల్లకూరులోని కృష్ణాపురం గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి టీహెచ్‌ఆర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దొరికే ఆకుకూరలు, కూరగాయలతోపాటుగా వేరుశనగ చిక్కీలు, రాగి పిండి, జొన్న పిండితో చేసిన రొట్టెలు బాగా తీసుకోవాలన్నారు.